క్లుప్తంగా

యూరియా సరఫరాలో జాప్యం తగదు: సీపీఎం

బెజ్జంకి(సిద్దిపేట): రైతులకు అవసరమయ్యే యూరియా సరఫరాలో జాప్యం చేయడం తగదని సీపీఎం మండల కార్యదర్శి తిప్పారం శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. బెజ్జంకిలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు అవసరమయ్యే సమయంలో యూరియా లేక రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే సరిపడా యూరియాను సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. మండల కమిటీ సభ్యులు సాయికృష్ణ, సంగ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హరిత తెలంగాణే లక్ష్యం



మొక్కలు నాటుతున్న హరితసేన సభ్యులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): హరిత తెలంగాణే లక్ష్యంగా మొక్కలు నాటుతున్నామని గ్రీన్ ఇండియా ఛాలెంజ్ హరితసేన నియోజకవర్గ ఇన్‌చార్జి అనిల్‌రెడ్డి అన్నారు. ఆదివారం తొలి ఏకాదశి సందర్భంగా మండలంలోని అలిరాజ్‌పేట గ్రామంలో 30 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలన్నారు. ప్రతి ఒక్కరు ప్రతి పండుగ రోజున మూడు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లోకేశ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భవాని, కృష్ణరెడ్డి, సతీశ్‌రెడ్డి, అశోక్, వెంకట్, సురేశ్ పాల్గొన్నారు.

వైభవంగా తొలి ఏకాదశి



వేణుగోపాలస్వామి ఆలయంలో పూజలు

తొగుట(దుబ్బాక): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం తొలి ఏకాదశి పండుగను ఘనంగా జరుపుకున్నారు. వెంకట్రావుపేటలోని వేణుగోపాలస్వామి, వేంకటేశ్వరస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలునిర్వహించారు. పూజారి రామకృష్ణాచారి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో తొగుట ఏఎస్‌ఐ రాంరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతిరావు, దుబ్బాక ఆత్మ కమిటీ డైరెక్టర్ ప్రవీణ్, మాజీ సర్పంచ్‌లు అంజమ్మ, లీలాదేవి, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



చిన్నకోడూరులో పీర్ల ఊరేగింపు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల వ్యాప్తంగా ఆదివారం ముస్లింలు మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. ఊదు, బెల్లం శాక పీర్లకు చదివించారు. కొందరు పీర్లకు దట్టీలు, కుడుకల పేర్లు, కొత్త దుస్తులు కట్టారు. అనంతరం గ్రామాల్లో పీర్లను నిమజ్జనం చేశారు.

పేదల సొంతింటి కల సాకారం



భూమిపూజ చేస్తున్న మహేందర్

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టిందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మైలారం, కమ్మర్లపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ముగ్గులు పోసి లబ్ధిదారులతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు అందజేస్తారన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తారని చెప్పారు. నాయకులు వినోద్, జయంత్ పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజ

బెజ్జంకి(సిద్దిపేట): ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలను పురస్కరించుకుని మండలంలోని గుగ్గిల్లలో ఆదివారం గురు పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రతియేటా ఆశాఢ మాస శుద్ధ పౌర్ణమిని వ్యాస పౌర్ణమిగా ఈవేడుకలు జరుపుతున్నామని చెప్పారు. పౌర్ణమి వరకుఈ గురుపూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హిందువులను జాగృత పరిచేందుకు 1925లో డాక్టర్ హెగ్డేవార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ అమరేంద్రప్రసాద్, ఉప మండల కార్యవాహ సురేశ్, మాజీ వైస్ ఎంపీపీ చాడ వెంకట్‌రెడ్డి, శంకరాచారి, సంతోష్, ధర్మారెడ్డి, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వేలాడుతున్న 'విద్యుత్'పాశాలు

బొడిగెపల్లికి వెళ్లే రహదారి పక్కనే వేలాడుతున్న విద్యుత్ తీగలు

విద్యుత్ తీగలు మృత్యుపాశాలై భయపెడుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అక్కన్నపేట మండలం బొడిగెపల్లికి వేళ్లే రోడ్డు పక్కనే ఉన్న ఐదారు విద్యుత్ స్తంభాలకు కరెంట్ తీగలు చేతికందేంత ఎత్తులో వేలాడుతున్నాయి. ఇటీవల గ్రామానికి తారురోడ్డు నిర్మించడంతో ఆ రోడ్డు కొంతమేర ఎత్తు పెరిగింది. దీంతో ప్రస్తుతం విద్యుత్ తీగలు చేయి లేపితే అందే స్థాయిలో ఉన్నాయి. ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ప్రాణాలు గాలిలోకి కలిసిపోయే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.

– అక్కన్నపేట(హుస్నాబాద్)

ఇరుకు గదుల్లో ఇబ్బందులు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అది కనిపించడం లేదు. మండలంలో పలు పాఠశాలల్లో అదనపు తరగతిగదుల కొరత, అసంపూర్తి నిర్మాణాలు, మరుగుదొడ్ల సమస్య వేధిస్తున్నాయి. పెద్దకోడూరు ప్రాథమిక పాఠశాలలో 161 మంది విద్యార్థులు ఉండగా రెండేళ్ల క్రితం అదనపు గదుల నిర్మాణం చేపట్టినా ఇప్పటి వరకు పూర్తి కాలేదు. ఇరుకు గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

– చిన్నకోడూరు(సిద్దిపేట)



వినియోగంలోకి రాని అదనపు తరగతిగదుల భవన నిర్మాణం



సా..గుతున్న అంగన్‌వాడీ నిర్మాణం

ఎల్లాయపల్లిలో అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనం నిర్మాణం

మండలంలోని ఎల్లాయపల్లిలో అంగన్‌వాడీ భవనం నిర్మాణ పనుల్లో జాప్యం కొనసాగుతోంది. ఈ భవన నిర్మాణానికి రూ.6.50 లక్షలు నిధులు మంజూరు కాగా ఏడేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. అయితే స్లాబ్ వరకు పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. దీంతో భవన నిర్మాణం అర్థంతరంగా నిలిచిపోయింది. చీకటిపడితే చాలు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

– చిన్నకోడూరు(సిద్దిపేట)

అతిథులొస్తే అవస్థలే..



శిథిలావస్థలో ఉన్న శనిగరం గెస్ట్‌హౌస్

శిథిలావస్థలో శనిగరం గెస్ట్‌హౌస్

- ఇరవై యేళ్లుగా మరమ్మతులు శూన్యం
- పైభాగం నుంచి ఊడిపడుతున్న పెచ్చులు
- ఇబ్బందులు పడుతున్న అధికారులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని శనిగరం మధ్య తరహా ప్రాజెక్టు ఆధ్వర్యంలోని గెస్ట్ హౌస్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఇరవై యేళ్లుగా మరమ్మతులకు నోచేకోవడం లేదు. ప్రాజెక్టు నిర్మాణం సమయంలో అధికారులు విశ్రాంతి తీసుకోవడం కోసం దానిని నిర్మించారు. అప్పట్లో కరీంనగర్ జిల్లా పరిధిలో ఉన్నప్పుడు గెస్ట్‌హౌస్ పరిసరాలో పూలతోటలు, వాటర్ సౌకర్యం ఉండేది. ఈ ఆవరణలోనే సిబ్బందికి రూమ్‌లు, కిచెన్, హాలు కూడా ఉండేవి. ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చిన జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఇక్కడే విశ్రాంతి తీసుకునే వారు. 2014లో సిద్దిపేట జిల్లాలో ఈ ప్రాంతాన్ని కలిపిన తరువాత పట్టించుకునే నాథులు కరువయ్యారు. నిధులు విడుదల చేయక పోవడంతో శిథిలావస్థకు చేరుకుంది.

హామీలకే పరిమితం

గెస్ట్‌హౌస్‌ను ఆనుకుని ఉన్న శనిగరం ప్రాజెక్టు 5,100 ఎకరాల్లో ఉంది. ఈ ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తామని అప్పటి నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ప్రస్తుత స్థానిక మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కాని అది ఇప్పటికీ కార్య రూపం దాల్చలేదు.

అధికారుల ఇక్కట్లు

శనిగరం ప్రాజెక్టు ద్వారా మూడు మండలాల్లో 5,100 ఎకరాలకు సాగునీరు అందుతుంది. వర్షాకాలంలో గేట్లు ఎత్తిన సమయంలో కిందిస్థాయి సిబ్బందితోపాటు ఉన్నతాధికారులు సైతం 24 గంటలు ఇక్కడే మకాం వేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టును పర్యవేక్షించే అధికారులు, ఉద్యోగులకు రెస్ట్‌హౌస్ లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. నిర్వహణపై సమీక్ష సమావేశాలు నిర్వహించేందుకు కూడా ఇబ్బందిగా మారింది.

నిర్మాణానికి 111 యేళ్లు

మండలంలోని శనిగరం గ్రామంలో ప్రాజెక్టు నిర్మించి నేటికి 111 యేళ్లు గడుస్తోంది. 1914లో నిజాం నవాబుల కాలంలో ఈ గెస్ట్‌హౌస్ నిర్మించారు. దీంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని పైకప్పు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. అతిథి గృహం పక్కన ఉన్న గదులు సైతం పూర్తిగా కూలిపోయాయి. మరమ్మతులకు నోచుకోక గెస్ట్ పరిసర ప్రాంతాల్లో పొదలు, పిచ్చి మొక్కలతో అస్తవ్యస్తంగా దర్శనమిస్తుంది.



పరిసరాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు

నిధులు కేటాయించాలి



శనిగరం గెస్ట్‌హౌస్ పురాతన భవనం కాబట్టి శిథిలావస్థకు చేరుకుంది. ప్రత్యేక నిధులు కేటాయించి అదే స్థానంలో నూతన భవనాన్ని నిర్మించాలి. గెస్ట్‌హౌస్ లేక అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి నూతన నిర్మాణం చేపట్టాలి.

– సూతారి కనకయ్య, మాజీ సర్పంచ్

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి



గజ్వేల్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గజ్వేల్‌రూరల్/చేర్యాల(సిద్దిపేట)/నంగునూరు(సిద్దిపేట): దివంగత మాజీ ఉప ప్రధాని డాక్టర్ జగ్జీవన్‌రామ్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని గజ్వేల్ పట్టణంలోని తూప్రాన్‌రోడ్డు మార్గంలో గల ఆయన విగ్రహానికి ఆది వారం పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ వివిధ మంత్రి పదవులు నిర్వహించి ప్రజలకు ఎనలేని సేవలు అందించారన్నారు. సామాజిక సమానత్వం కోసం పోరాటం చేసిన సంస్కర్తగా దేశ చరిత్రలో నిలిచిపోయిన గొప్ప దార్శనికుడని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్, దళిత, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. అలాగే చేర్యాల మండల పరిధిలోని కమలాయపల్లిలో జరిగిన కార్యక్రమంలో జాంబవ కుల సంఘం అధ్యక్షుడు సింగపాక మల్లయ్య, స్థానికులు ఆరుట్ల కనకయ్య, గందమల్ల యాదగిరి, వజ్రోజు శంకరాచారి, కనకయ్య, బాలరాజు, దేవదాస్ తదితరులు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలువేసి నివాళులర్పించారు. నంగునూరులో ఎమ్మార్పీఎస్ నాయకులు నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల సంక్షేమం కోసం కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అన్నారు. బాలరాజు, రాజమౌళి, నర్సింగారావు, కనకయ్య, భూమయ్య, హరిబాబు, కిష్టయ్య, ఇస్తారి, కనకయ్య పాల్గొన్నారు.

అధిక పనిభారం మోపడానికే..

సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు



జీఓ ప్రతులను దహనం చేస్తున్న కార్మిక నేతలు

గజ్వేల్‌రూరల్: కార్మికులపై అధిక పనిభారం మోపడానికే రాష్ట్ర ప్రభుత్వం జీఓ 282ను తీసుకువచ్చిందని సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు మండిపడ్డారు. వారానికి 48 గంటలు అని చెప్తూనే దుకాణాల్లో 10 గంటలు పనిచేసుకోవచ్చంటూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ తీసుకురావడాన్ని ఖండించారు. ఆ జీఓను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం అంబేడ్కర్ చౌరస్తా వద్ద జీఓ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టాలకు అనుగుణంగా రాష్ట్రా ప్రభుత్వాలు నూతనంగా రూల్స్‌ను తయారు చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పునఃపరిశీలించి వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 9న నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను కార్మికులంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ నాయకులు బండ్ల స్వామి, రంగారెడ్డి, కృష్ణమూర్తి, రాజు, రామారావు, ఏఐటీయూసీ నాయకులు కృష్ణ, పోచయ్య, శ్రీనివాస్, రమణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి.. బోనం అందుకోతల్లీ



అమ్మవారు



మహంకాళి దేవికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

గజ్వేల్‌రూరల్: ఆషాఢ మాసంలో నిర్వహించే మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు ఆదివారం కూడా ఆలయ పూజారి చాడ నందబాలశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి, భాస్కర్ తదితరులు మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆషాఢమాసంలో భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు చెప్పారు. మహిళలు బోనాలను అందంగా అలంకరించి నెత్తిన పెట్టుకొని డప్పుచప్పుల మధ్య దేవాలయం వరకు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి తొట్టెల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

పోచమ్మా... కరుణించమ్మా..



బెజ్జంకిలో పోచమ్మ బోనాలతో వస్తున్న మహిళలు, భక్తులు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ప్రధాన వీధుల గుండా ఆలయానికి తరలి వెళ్లి పోచమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని కోరారు. ప్రతియేటా ఆషాఢ మాసంలో బోనాలు చేయడం ఆనవాయితీగా వస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు, సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

గరుడ విగ్రహ నిర్మాణానికి భూమిపూజ

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయ సమీపంలో గరుడ విగ్రహ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. తిరుపతి లాంటి పుణ్య క్షేత్రాల వద్ద ఉన్న గరుడ విగ్రహ నిర్మాణానికి యువకులు ముందుకు రావడం హర్షణీయమని ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ అన్నారు. కార్యక్రమంలో యువకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం

'చలో వరంగల్'కు తరలిరండి

- టీవీఏసీ జేఏసీ కో–చైర్మన్ కనకరాజు



పుల్లూరులో పోస్టర్ అతికిస్తున్న కార్మికులు

సిద్దిపేటరూరల్: అందరం కలిసి సమస్యల పరిష్కారానికి కృషిచేద్దామని, విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ ఆధ్వర్యంలో 9వ తేదీన జరగనున్న చలో వరంగల్ సభకు కార్మికులంతా తరలి రావాలని జేఏసీ జిల్లా కో చైర్మన్ కనకరాజు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రాఘవాపూర్, పుల్లూరు గ్రామాల్లో ఆదివారం సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 నుంచి జరగనున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయడంలో భాగంగా 9న వరంగల్లో భారీసభ నిర్వహించనున్నట్లు చెప్పారు. గతంలో వరంగల్లో భారీగా నల్ల చొక్కాల ప్రదర్శన నిర్వహించడం వల్ల కాంట్రాక్ట్ కార్మికుల నుంచి ఆర్టిజన్లుగా నామకరణం జరిగిందన్నారు. కార్మికులంతా 9న చలో వరంగల్‌లో పాల్గొని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. రెగ్యులర్ పోస్టులను విద్యార్హతను బట్టి కన్వర్షన్ అయ్యేలా ముందుకు సాగుదామన్నారు. కార్యక్రమంలో కరుణాకర్, రాజు, పరశురాములు, భూపాల్ రెడ్డి, లక్ష్మారెడ్డి, కమలాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

వర్గల్(గజ్వేల్): మండలంలోని నాచారం, సీతారాంపల్లి 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏఈ వాసుదేవరావు ఆదివారం తెలిపారు. ఉదయం 7 నుంచి 11.30 వరకు సీతారాంపల్లి, వేలూరు, నాచారం, అనంతగిరిపల్లి గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

వేతనాలు విడుదల చేయాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఎఫ్ఏల సంఘం మండలాధ్యక్షుడు యాదగిరి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నాలుగు నెలల నుంచి వేతనాలు రాక కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. వెంటనే వేతనాలు అందించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, గురువులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని వేచరేణి ఉన్నత పాఠశాలలో 2004–2005లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. స్థానిక వీరభద్ర పంక్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో 20 యేళ్ల తర్వాత కలిసిన వారంతా ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, మురళీకృష్ణ, శ్రీహరి, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ప్రశాంత్‌కుమార్, శ్రీనివాస్, ఫాతిమారాణి, పూర్వ విద్యార్థులు సురేశ్, కమలాకర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, రామచంద్రం, జామిల్ పాషా, భాస్కర్, రాజశేఖర్, రియాజ్, నరేందర్, శ్రీనివాస్, సంతోష్, సుకన్య, భాగ్య, మంజుల, అనిత, రజిత, అరుణ, బాలలక్ష్మి, వినోద, ఫాతిమా, వినోద తదితరులు పాల్గొన్నారు.

గొప్ప జాతీయవాది శ్యాం ప్రసాద్ ముఖర్జీ

శ్యామ్ ప్రసాద్ జయంతి సందర్భంగా పలు చోట్ల బీజేపీ నాయకులు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ గొప్ప జాతీయవాది అని కొనియాడారు.



హుస్నాబాద్: నివాళులర్పిస్తున్న శంకర్ తదితరులు



చేర్యాలలో..

హుస్నాబాద్/చేర్యాల(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట)/చిన్నకోడూరు(సిద్దిపేట): హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు తదితరులు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వీరాచారి, నరేశ్, సమ్మయ్య, రాంప్రసాద్, దేవేందర్ రెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. చేర్యాలలో అంగడిబజార్ వద్ద జరిగిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వద్లకొండ సంజీవులు, జిల్లా ఉపాధ్యక్షుడు బూర్గు సురేశ్, నాయకులు రాందాసు, సత్యవర్ధన్, పాండు, బాలరాజు, షాదుల్లా, బాబు, ప్రవీణ్, అనిల్, సత్యనారాయణ, మహేశ్, భానుప్రకాశ్, రాములు, మల్లేశం, నరేశ్, సలీం, సాయి తదితరులు పాల్గొన్నారు. బెజ్జంకి మండలంలోని దేవక్కపల్లెలో నిర్వహించిన కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజు, కమలాకర్‌రెడ్డి, మల్లేశం, సతీశ్‌రెడ్డి, బాల్‌రెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. చిన్నకోడూరులో మండల అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, సంతోష్, బాపయ్య, మహేశ్, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.